కోదండ రామాలయ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 12: జిల్లా కేంద్రంలోని కోదండ రామాలయ బ్రహ్మోత్సవాలు ఈనెల 15 నుంచి ప్రారంభంకానున్నాయి. శుక్రవారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని వారి నివాసాల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు బండ నరేందర్ కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆయనతో ఆలయ కమిటీ సభ్యులు, ప్రధాన అర్చకుడు మధుసూదన్‌చారి తదితరులు ఉన్నారు.

స్వచ్ఛంద పదవీ విరమణ ఊహాజనితమే..

మెదక్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): ప్రసార, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ఉద్యోగుల స్వచ్ఛంద పదవీ విరమణ వార్తలన్నీ ఊహాజనితమైనవని టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ అన్నారు. 33 ఏండ్లు సేవలందించి స్వచ్ఛంద పదవీ విరమణ చేయిస్తామంటే టీఎన్జీవో సంఘం చూస్తూ ఊరుకోదన్నారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు నిరంతరం పోరాడుతామన్నారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్ ఉన్నారు.

వడ్ల కుప్పను ఢీకొని ఒకరికి గాయాలు

రామాయంపేట, ఏప్రిల్ 12: రోడ్లపై ధాన్యం కుప్పలు పోయడంతో వడ్ల కుప్పను ఢీకొని ఒకరికి తీవ్రగాయాలైన ఘటన రామాయంపేట మండల శివ్వాయపల్లి గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగింది. చిన్నశంకరంపేట మండలం సంకాపూర్ గ్రామానికి చెందిన బాలయ్య తన బంధువుల వద్దకు బైక్‌పై వెళ్లి తిరుగు ప్రయాణంలో శివ్వాయపల్లి సమీపంలోని రోడ్లపై ఉన్న వడ్ల కుప్పలను ఢీకొట్టి పడిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అంబులెన్సు ద్వారా క్షతగాత్రుడిని రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. రామాయంపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హనుమాన్ మాలధారులకు భిక్ష

చేగుంట, ఏప్రిల్ 12: చేగుంట, నార్సింగి మండలాల్లో హనుమాన్ దీక్ష తీసుకున్న స్వాములకు షిర్డీ సాయిబాబా ఆలయ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మ యాదగిరి నివాసంలో భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురు స్వామి, పలువురు హనుమాన్ మాలధారులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఉరేసుకుని ఒకరు మృతి

శివ్వంపేట, ఏప్రిల్ 12: ఉరేసుకుని ఒకరు మృతి చెందిన ఘటన శివ్వంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఎస్సై మహిపాల్ రెడ్డి కథనం ప్రకారం.. తూప్రాన్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన చీమల ఎల్లం(45) కూలీ చేసుకుంటూ జీవిస్తుండేవాడు. రోజు మాదిరిగా ఈనెల 10న ఉదయం పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. మళ్లీ ఇంటికి తిరిగి రాలేదు. శుక్రవారం మధ్యాహ్నం మండలంలోని దంతాన్‌పల్లి గ్రామ శివారులో ఓ చెట్టుకు ఉరేసుకుని మృత దేహం ఉందని అటు వెళ్లిన గ్రామస్తులకు కనిపించిందనే సమాచారం గ్రామస్తులకు తెలియడంతో, వారు పోలీసులకు తెలిపారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతుడి వివరాలు ఆరా తీసి, చీమల ఎల్లంగా గుర్తించారు. అప్పులు ఎక్కువ కావడంతోనే ఉరేసుకుని మృతి చెందినట్లు భార్య ప్రొద్దుటూరు యాదమ్మ ఫిర్యాదులో పేర్కొన్నది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అందుబాటులో కొనుగోలు కేంద్రాలు

- కేంద్రాల్లో టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు ఉంచుకోవాలి
- కేంద్రాల వద్ద ఇబ్బందులు ఉండొద్దు
- ధాన్యం కొనుగోలు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి
- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

చేగుంట: అనంతసాగర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌రావు

మెదక్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పక్కాగా ధాన్యం సేకరిస్తున్నట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా హవేళీ ఘనపూర్ మండలం బూరుగుపల్లి, వాడి, రాజుపేట, కొత్తపల్లి, గాజిరెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నీటి సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులోకి వచ్చాయన్నారు. జిల్లాలో పండించిన ధాన్యానికి ఎలాంటి ఆరోపణలు రాకుండా రైతుల నుంచి సమయానికి కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అన్ని ప్రాంతాల్లో ఇప్పటికే ధాన్యం కోతకు వచ్చిందని, ఆయా ప్రాంతాల్లో రైతుల నుంచి ధాన్యాన్ని కొంటున్నారన్నారు. నాణ్యత గల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, ఫ్యాక్స్ సీఈవో సాయి, సంబంధిత కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చేగుంటలో..

చేగుంట, ఏప్రిల్ 12: రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌రావు అన్నారు. ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొంటుందని ఆయన స్పష్టం చేశారు. చేగుంట మండలంలోని అనంతసాగర్, ఇబ్రహీంపూర్, బోనాల్ తదితర గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తాగు నీటిసౌకర్యం, నీడ కోసం టెంట్లు ఏర్పాట్లు చేయాలన్నారు. తాళ్లు లేకుండా, ఆర బెట్టిన ధాన్యాన్ని కేంద్రానికి తీసుకురావాలన్నారు. అకాల వర్షానికి తడువకుండా టార్పాలిన్లు తెచ్చుకోవాలన్నారు. ఆయనతో చేగుంట ఐకేపీ ఏపీఎం లక్ష్మీనర్సమ్మ, రామస్వామి, శ్వేత, స్వామి, అంజ్యానాయక్, వీవో లీడర్లు, మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు.

తూప్రాన్‌లో..

చేగుంట, ఏప్రిల్ 12: రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం చేగుంటలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సొసైటీ సీఈవోలు, ఐకేపీ సిబ్బందితో సమీక్షించారు. ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే రైతుల ఖాతాల్లో డబ్బులు తొందరగా జమచేయవచ్చన్నారు. కార్యక్రమంలో చేగుంట ఎంపీడీవో చిన్నరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ స్వప్న, ఐకేపీ ఏపీఎం లక్ష్మీనర్సమ్మ, పంచాయతీ కార్యాదర్శులు, సీఈవోలు, సీఏలు పాల్గొన్నారు.

గొంతెండుతున్న తండాలు

- అడుగంటిన జలాలతో తాగునీటి తంటాలు
- గుక్కెడు నీటికి వ్యవసాయ బోరుబావులే దిక్కా?
- కామారం రాజ్యాతండాలో తాగునీరందక ఇబ్బందులు

చిన్నశంకరంపేట: కామారం రాజ్య గిరిజన తండాలో వ్యవసాయ బోరు బావుల వద్ద నుంచి మంచినీటిని తెచ్చుకుంటున్న గిరిజన మహిళలు

చిలిపిచెడ్: గణ్యా తండాలో తాగునీటి కోసం వాటర్ ట్యాంకర్ వద్ద నీరు పడుతున్న తండా ప్రజలు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 12: గుక్కెడు తాగునీటి కోసం తిప్పలుతప్పడం లేదు. మండలంలోని కామారం గోపియా గిరిజన తండాలో గిరిజన మహిళలు తాగునీటి కోసం వ్యవసాయ బోరుబావులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొన్నది. తాగునీటి కోసం తండవాసులు నానా తంటాలు పడుతున్నారు. మండలంలోని కామారం రాజ్యాతండాలో ఉన్న బోరుబావిలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. బోరు నుంచి చుక్క నీరు రావడంలేదు. మిషన్ భగీరథ పైపులైన్ కాల్వ తవ్వకంతో తెగిపోయింది. దీంతో తండావాసులు తాగునీటి కోసం నరకయాతనను అనుభవిస్తున్నారు. సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని తండావాసులు ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో తాగునీటి కోసం వ్యవసాయ బోరుబావులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొన్నది. మంచినీటి సౌకర్యం కల్పించి తమ దాహార్తిని తీర్చాలని తండావాసులు కోరారు.

గణ్యా తండాలో తాగునీటి ఎద్దడి

చిలిపిచెడ్, ఏప్రిల్ 12: మండలంలోని గణ్యా తండాలో తాగునీటి సమస్య ఏర్పడడంతో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం తండాలో నీరు రాకపోవడంతో వాటర్ ట్యాంకర్‌తో నీటిని అందించారు. గణ్య తండాలో కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తండా ప్రజలకు నీరు అందించాలని కోరుతున్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే గంగలో వేసినట్లే

- మూడు నెలల్లో కాంగ్రెస్ రూ.15వేల కోట్ల అప్పు చేసింది
- దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యం
- రామాయంపేటలో రోడ్‌షోలో మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

రామాయంపేటలో మాట్లాడుతున్న బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు రోడ్‌షో

రామాయంపేట, ఏప్రిల్ 12: ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్లేస్తే గంగలో వేసినట్టేనని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నాడు. శుక్రవారం రామాయంపేటలో రోడ్‌షో నిర్వహించి మెదక్ చౌరస్తా వద్ద ప్రజలనుద్దేశించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సమస్యల కోసం కాకుండా ఎమ్మెల్యేలను కొనడానికే గేట్లు తెరిచారన్నారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఎన్నడూ ప్రధాని కాలేడన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసి మూడు నెలలు కాకముందే రూ.15 వేల కోట్లు అప్పు చేశారని, ఇలాంటి సీఎంను ఇంతవరకు చూడలేదని మండిపడ్డారు. ఎప్పుడూ ఢిల్లీకి తిరగడమే తప్ప ప్రజల కోసం ఏనాడైనా ఆలోచించాడా అని ప్రశ్నించారు. ఇలాంటి సీఎం ఎక్కువ కాలం ఉండడన్నారు. మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. నేడు తెలంగాణలో ఉపాధి పనులు జరుగుతున్నాయంటే అది మోదీ పుణ్యమేనన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రాజేంద్ర ప్రసాద్, మాజీ సర్పంచ్ సిద్దరాములు, సుధాకర్‌రెడ్డి, బీజేపీ పట్టణాధ్యక్షుడు బానుచందర్, శంకర్‌గౌడ్, శ్రీనివాస్, రమేశ్, బాలరాజు, దయానంద్‌రెడ్డి, నరేందర్ ఉన్నారు.

వైభవంగా పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణం

నిజాంపేట, ఏప్రిల్12: నిజాంపేటలో పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బాబు, సభ్యులు మహేందర్, జాల పోచయ్య, పంజా శ్రీను, గెరుగంటి బాబు, రెడ్డి రాకేశ్, నాగరాజు తదితరులు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్‌కు ప్రత్యేక స్థానం

- బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే
- 15 సీట్లు గెలిచి రాహుల్‌గాంధీకి బహుమతిగా ఇవ్వాలి
- మంత్రి కొండా సురేఖ

నర్సాపూర్‌లో మాట్లాడుతున్న దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, పక్కనే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు

నర్సాపూర్, ఏప్రిల్ 12: పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్‌కు ప్రత్యేక స్థానం ఉందని దేవాదాయ, అటవీ శాఖ మంత్రి, మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం నర్సాపూర్‌లోని సాయికృష్ణ గార్డెన్‌లో నర్సాపూర్ నియోజకర్గ స్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ, కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం నీలం మధు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ నుంచి ఇందిరా గాంధీ ఎంపీగా గెలిచారన్నారు. నానమ్మ గెలిచిన స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి ఎంపీగా గెలిస్తే మనువడు రాహుల్‌గాంధీ, కోడలు సోనియాగాంధీ సంతోషపడతారని వెల్లడించారు. ఎంపీ అభ్యర్థి నీలం మధుకు ప్రజల్లో మంచి పలుకుబడి ఉందన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేస్తే 45 వేల ఓట్లు వచ్చాయన్నారు. ముదిరాజ్, బీసీ బిడ్డగా నీలం మధును ఆశీర్వదించాలని కోరారు. బీజేపీకి ఓటేస్తే బీఆర్ఎస్‌కు వేసినట్టేనని, బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి ఓటు వేసినట్టేనని పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 14, 15 ఎంపీ స్థానాలు గెలిపించి, రాహుల్‌గాంధీకి బహుమానంగా ఇవ్వాలన్నారు. ప్రతిఒక్కరూ నీలం మధు విజయానికి కృషి చేయాలని కోరారు.

ఆశీర్వదించి గెలిపించండి: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు

మెదక్ ఎంపీగా తనను ఆశీర్వదించి, గెలిపించాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు కార్యకర్తలను కోరారు. ఉప సర్పంచ్ స్థానం నుంచి ఎంపీ అభ్యర్థిగా ఎదిగానని, ప్రజలందరూ ఆశీర్వదించాలని వెల్లడించారు. తెలంగాణకు బీహెచ్ఈఎల్, ఇక్రిసాట్, సింగూర్ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కూడా కాంగ్రెస్ పార్టేనన్నారు. పార్లమెంట్‌కు నన్ను పంపిస్తే నిధులు తీసుకొచ్చి మెదక్‌ను అభివృద్ధి చేస్తానన్నారు. గ్రామాల్లో సంక్షేమ ఫలాలు అందేలా చూస్తానన్నారు. అన్ని వర్గాలకు కార్పొరేషన్ పదవులు వరించడం కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యపడిందని తెలిపారు. సమావేశంలో మైనంపల్లి హన్మంతరావు, సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, ఎంపీపీ జ్యోతిసురేశ్, నాయకులు మల్లేశం, అశోక్, మణికంఠ, సుహాసిని రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, సుజాత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్, ఏప్రిల్ 12: హుస్నాబాద్‌లో ద్విచక్ర వాహనంపై గంజాయి తెచ్చి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. కిలోన్నర గంజాయితో పాటు ద్విచక్ర వాహనం, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిల ప్రకారం.. పట్టణంలోని కరీంనగర్ రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో శుక్రవారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. గంజాయిని విక్రయిస్తున్న హుస్నాబాద్‌కు చెందిన చుక్క అనిల్, హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వీర్ల

కిలోన్నర గంజాయి పట్టివేత

గడ్డతండాకు చెందిన గుగులోతు సంతోష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. వీరిద్దరూ కలిసి వీర్ల గడ్డతండాకు చెందిన భూక్య రమేశ్ వద్ద గంజాయి కొనుగోలు చేశారని, ఇతడి కోసం వెతుకుతున్నట్లు చెప్పారు. గంజాయి తదితర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ఏం చేస్తున్నారో ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన

తూప్రాన్, ఏప్రిల్ 12: మండలంలోని నర్సంపల్లిలో మూడు రోజులుగా జరుగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనం గా ముగిశాయి. శుక్రవారం ఆవాహిత దేవత పూజ, ప్రతిష్ఠ, హోమం తోపాటు రోహిణి నక్షత్ర యుక్త మిథున లగ్నంలో యంత్ర నాభిశిల స్థాపన జరిపారు.

దుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్సీ శేరి

దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి

పాపన్నపేట, ఏప్రిల్ 12: ఏడుపాయల వనదుర్గా మాతను ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి శుక్రవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్సీ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఉద్యోగి మధుసూదన్ రెడ్డి ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డిని శాలువా కప్పి సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎమ్మెల్సీకి ఆహ్వాన పత్రిక అందజేత

రామాయంపేట, ఏప్రిల్ 12: రామాయంపేటలో ఈనెల 17న నిర్వహించనున్న రామచంద్రస్వామి కల్యాణానికి రావాలని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో నిర్వాహకులు శుక్రవారం అందజేశారు.

ప్రచారంలో కాంగ్రెస్ పనితీరును ఎండగడుతాం

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్

దంతాన్‌పల్లిలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

శివ్వంపేట, ఏప్రిల్ 12: వంద రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో ప్రజలకు వివరిస్తూ ఎండగడుతామని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని దంతాన్‌పల్లిలో బీఆర్ఎస్ ఎంపీ ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందరోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలుచేస్తామని కాంగ్రెస్ ప్రజలను నమ్మించి, గెలిచాక హామీలను తుంగలో తొక్కిందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధి పనులు, కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరును ప్రజలకు వివరిస్తూ ఏకం చేస్తామన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకటరాంరెడ్డికి శివ్వంపేట మండలం నుంచి మెజార్టీ అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, సీనియర్ నాయకులు లావణ్యా మాధవరెడ్డి, నాగేశ్వర్‌రావు, కన్నారం దుర్గేశ్, ఇందిర శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు లాయక్, పూల అర్జున్, యాదాగౌడ్, చెన్నా నాయక్, మహేందర్‌రెడ్డి, జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

మాట్లాడుతున్న డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

మెదక్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): మనువాదాన్ని ఓడించి, స్వేచ్ఛ, సమాన త్వం, సోదరాభావం, సామాజిక ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందిస్తున్న భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పీ.శంకర్ అన్నారు. డీబీఎఫ్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రచారోద్యమ సదస్సు ను శుక్రవారం మెదక్‌లోని కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించారు.కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశం, దళిత నేతలు రామస్వామి, ఎమ్మార్పీఎస్ నాయకులు బాల్‌రాజు, బీసీ సంఘం నాయకులు మోహన్, సంజీవ్, ఇసాక్, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజీవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మకొండ దయాసాగర్ పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై కళా ప్రదర్శన

ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న కళాకారుల బృందం

మెదక్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో చైతన్యం కల్పిస్తున్నట్లు జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్ర రాజు, స్వీప్ నోడల్ అధికారి రాజిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మెదక్, నర్సాపూర్ మున్సిపాలిటీ, బస్టాండ్ చౌరస్తా, గ్రామంలో కళాకారులతో ఆటపాటలతో వివరించారు. కళాకారులు సిద్దులు టీం లీడర్ ఎల్లయ్య, కృష్ణ, కారంగుల మాధవి, విజయలక్ష్మి, సందుల శేఖర్, జింక దేవదాస్, రామారావు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టర్ల నూతన కార్యవర్గం

తూప్రాన్ డివిజన్ విద్యుత్ ప్రైవేటు కాంట్రాక్టు నూతన కార్యవర్గం

రామాయంపేట, ఏప్రిల్ 12: తూప్రాన్ విద్యుత్ ప్రైవేట్ కాంట్రాక్టర్ల నూతనంగా కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. తూప్రాన్ డివిజన్ కేంద్రంలోని టీఎస్ఎస్పీడీసీఎల్ కాంట్రాక్టు అసోసియేషన్ అధ్యక్షుడిగా పొలాస ఆంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికను రాష్ట్ర విద్యుత్ కాంట్రాక్టు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు విశ్వేశ్వర్‌రావు, జాయింట్ సెక్రటరీ ఆంజనేయులు సమక్షంలో నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా రాధాకృష్ణ, కార్యదర్శిగా కొండయ్యగారి వెంకటస్వామి, కోశాధికారిగా నవీన్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు విశ్వేశ్వర్‌రావు మాట్లాడుతు విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టర్లు కలిసి ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్నారు.

ఏడు నెమళ్లు మృతి

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 12: కొండపాక మండలం దుద్దెడలో శుక్రవారం ఆరు నెమళ్లు మృతిచెందాయి. ఆక్సిజన్ పార్కులో చికిత్స పొందుతూ మరో నెమలి మృతి చెందింది. ఈ ఏడు నెమళ్లను ఆక్సిజన్ పార్కులో అధికారుల సమక్షంలో ఖననం చేశారు. ప్రాథమికంగా పొలంలో గుళికలు తినడంతో మృతి చెంది ఉండవచ్చని డిప్యూటీ రేంజ్ లింగమూర్తి , దుద్దెడ వెటర్నరీ డాక్టర్ మౌనిక తెలిపారు. రిపోర్టులు వచ్చిన తర్వాత నెమళ్ల మృతికి కారణం తెలుస్తుందన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

FINANCIAL SERVICES

★రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార రుణం, అతి తక్కువ వడ్డీ రేటుతో, సిబిల్ అవసరం లేదు! NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏజెంట్స్ కావలెను. నొవా ఫైనాన్స్. ఫోన్: 7696660523.
NT-311979_All

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311823-All

★Wanted Field Verification, Collection Executives (piece work)office 632, Chandralok, Paradise secunderabad 7013168227, WA 7893601146
NT-328325

DOCUMENT LOST

★I K.Ramesh S/o K.Narsaiah Flat no: 103, Age 39yrs Occ:Private employee R/o of SBI Building, Chegunta. I lost the Orginal sale deeds, Doc No's: 231/1998, 5960/1997, 554/1966, 5470/1997, SRO Medchal. While I'm traveling from medchal to Shankarampet-R, Medak-Dist on bike. After reaching my place I came to known that Documents are missing/lost on dated 11/04/2024. If any body found please call 6303688491
NTZ-324679

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్ద